'ఆటా' కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# మూడుముళ్ల బంధం

-డి.కామేశ్వరి

మూడురోజుల అంతర్మథనం తరువాత మనసులో మాట కొడుకు ముందుపెట్టింది రాజేశ్వరి. అమెరికా కొడుకు ఆశ్చర్యంగా చూశాడు. గత పదేళ్లలో ఎన్నిసార్లు రమ్మని పిల్చినా ఏదో ఒకవంక చెప్పే అమ్మ 'తనంతట తనుగా' నన్నోసారి నీతో తీసికెడతావా. కొన్నాళ్లుండి రావాలని వుందిరా అనడం సంతోషంతోపాటు ఆనందాన్నిచ్చింది. 'నాన్న వస్తానన్నారా' అనుమానంగా అడిగాడు కొడుకు. రాజేశ్వరి తల దించుకుని 'నేను ఒక్కర్తినే వస్తాను' అని ఆగి 'నాకిక్కడ నించి రెండుమూడు నెలలు దూరంగావెళ్లి ప్రశాంతంగా బతకాలనిపిస్తూందిరా'- రాజేశ్వరి గొంతు రుద్ధమయి, కళ్లు తడి అయ్యాయి. 'వయసుతోపాటు కాల్చుకు తినడం ఎక్కువైందిరా నానీ. అనని మాట లేదు, నోటికెంతొస్తే అంత అందరిముందు అనడం, ప్రతిదానికి విసుగు, కసుర్లు. పడలేక పోతున్నారా -నాకూ డెబ్బై ఏళ్లు వచ్చాయి -నేనూ మనిషినని, నాకూ అభిమానం, అవమానం వుంటుందని ఆయన ఎప్పటికీ గ్రహించరు. యీ వయసులో కూడా వేళకి వండి, అన్నీ అమర్చి చాకిరి చేస్తున్నాననే కృతజ్ఞతన్నా లేదు. ఆయనకి వచ్చినట్టే నాకు వయసు వచ్చిందని ఓపిక తగ్గిందని గుర్తించరు. నాలోటు తెలియాలంటే ఆయన్ని వదిలి కొన్నాళ్లు దూరంగా వుండాలని నిర్ణయించుకున్నాను' కళ్ళు తుడుచుకుంది రాజేశ్వరి. తండ్రి సంగతి తెల్సిన కొడుకు తల్లి వంక సానుభూతిగా చూశాడు. ఆమె ఆవేదన అర్థం అయింది. 'నీకెన్నిసార్లో చెప్పానమ్మా మరీ అంతలా పడి వుండద్దని. జవాబిస్తూ వుండమని -నీవలా వూరుకోబట్టే ఆయన నిన్ను లోకువకట్టారు...' కోపంగా అన్నాడు.

'నోరు మూసుకు సహిస్తుంటేనే యిలా అనే మనిషి జవాబిస్తే సహిస్తార్రా- నా సహనానికీ హద్దుందని ఆయనకి తెలియాలి. నన్ను కొన్నాళ్లు తీసికెడతావా -నీకిబ్బంది లేకపోతేనే'.

ఏమిటమ్మా అలా మాట్లాడుతావు -ఎన్నిసార్లు పిలిచాను రమ్మని -నాన్నకిబ్బందని వంటరిగా వదిలి రావడం బాగుండదని అన్నావు -అమ్మా, నీ కిష్టమైనన్ని నాళ్లు ఉందువుగాని.

'అయితే మీ నాన్నగారితో చెప్పి టిక్కెట్టది ఏర్పాటు చెయ్యి'.

* * *

'నాన్నా... అమ్మనీసారి నాతో తీసికెడ్తున్నాను. కొన్నాళ్లుండి వస్తుంది' అన్నాడు నరేష్. ఒక్క క్షణంలో విశ్వనాథంగారి మొహం ఎర్రబడి 'ఏం, నేను చచ్చాననా అమ్మని తీసికెళ్లడం' దురుసుగా అన్నారు. 'అమ్మకి కొన్నాళ్లు మార్పు కావాలనుకుంటోంది. నాతో వస్తానంది, తీసికెడ్తున్నాను. కొన్నాళ్లుండి వస్తుంది' మరో మాట అనే వీలు లేకుండా తన నిర్ణయం చెప్పాడు.

'కొన్నాళ్లేం ఖర్మ శాశ్వతంగా వుంచుకో, నాకేం ఫరవా లేదు. నా గురించి ఎవరికి బెంగక్కరలేదు. నా సంగతి నేను చూసుకోగలను' ఉక్రోషం, అసహనం ధ్వనించింది గొంతులో. పక్కనించి రాజేశ్వరి ఏదో అనబోతే కొడుకు 'వూరుకో' అని సైగచేసి 'అమ్మ వంట మనిషిని మాట్లాడి, మన పద్ధతులు, అలవాట్లు అన్నీ చెప్పింది. మీకేం ఇబ్బంది వుండదు. ఆవిడ యింట్లో వుండి చూసుకుంటుంది. 'అయ్యో పాపం, నా గురించి అంత యావక్కరలేదు. నా సంగతి నేను చూసుకోగలను' మొగం ఎర్రపరుచుకుని లేచి గదిలోకి వెళ్లిపోయారు విశ్వనాథం. రాజేశ్వరి కలవరంగా కొడుకు వంక చూసింది. 'వూరుకో అమ్మా ఆయన సంగతి మనకి తెలీదా. నీవు మాట్లాడక వూరుకో నేను చూసుకుంటా-' నరేష్ అభయం యిచ్చాడు.

* * *

పదిహేను రోజుల తర్వాత టిక్కట్లు, వీసా ఏర్పాటులు పూర్తి అయ్యాయి- 'నాన్న రేపు సాయంత్రం బయలుదేరుతున్నాం' కొడుకు చెప్పాడు. తన కోపాన్ని, అయిష్టతనీ గుర్తించీ వెళ్లడానికే భార్య తయారయిందన్న నిజాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. 'మంచిది' అన్నారు ముభావం, వ్యంగ్యం కలిపి. 'వంటావిడ వచ్చారు. అన్నీ చూపించి చెప్పింది అమ్మ. మీకేం యిబ్బందుండదు.'

'నాకేం యిబ్బంది, ఎవరన్నారు యిబ్బందని, కోడి పెట్ట ముసలమ్మ మాదిరి యీవిడ లేకపోతే గడవదనుకొక్కర లేదు. పెళ్లి శాశ్వతంగా అక్కడుండచ్చు నేను చచ్చాననుకుని.' ఆఖరి అస్త్రం వదిలారు విశ్వనాథంగారు- అంత మాటన్నాక భార్య ఆగిపోవచ్చు అన్న ఆశ. మర్నాడు అంతా ఆవిడ పచ్చళ్లు, పొడులు చేస్తూ, స్వీట్లు తెప్పించి సర్దడం, పెద్ద పెట్టె నిండా బట్టలు సుర్దుకోడం చూస్తూ చిన్న పిల్లాడిలా ఉక్రోషపడిపోయారాయన.

* * *

'బాబుగారూ, టిఫిను పెట్టాను-' వంటావిడ సీతమ్మగారు వినయంగా అంది. 'మీరు పిలవక్కరలేదు. టైమయితే నేనే వస్తా' చదువుతున్న పేపరు వంచి తలెత్తి మొహం చిట్లించి అన్నారు విశ్వనాథం. వంటావిడ ముఖం చిన్నపుచ్చుకుని లోపలికి వెళ్లిపోయింది. రాజేశ్వరి వెళ్లి పట్టుమని యిరవైనాల్గుగంటలు గడవలేదు. కానీ యింట్లో ఏదో వెలితి. శూన్యం. ఆ శూన్యం ఆయన మనసులోనూ ఏర్పడినట్టయింది. చాలా నిబ్బరంగా. గంభీరంగా పైకివున్నా నిన్నటినించి ఆయన మనసు మనసులో లేదు. రాజేశ్వరి వెడ్తూ ఏదో లాంఛనంగా చెప్పాలి గదా అన్నట్టుగా 'వెడ్తున్నాను. జాగ్రత్త' అని మాత్రం అంది. ఆయన మొఖం పక్కకి తిప్పుకుని జవాబివ్వలేదు. కొడుకు- 'ఫోను చేస్తూంటాను నాన్నా- ఆరోగ్యం జాగ్రత్త' అన్నాడు. ఆవిడ వెళ్లాక వంటరిగా తల్లి వదిలి వెడితే చిన్నపిల్లాడు ఉక్రోషపడినట్టు రాత్రంతా బాధపడ్డారాయన.

'ఏమిటివి యిడ్లెన్నా. యిటిక రాళ్లా. యింత గట్టిగా వున్నాయేమిటి-' సీతమ్మ గతుక్కుమంది. 'అమ్మగారు చెప్పినట్టు, చూపించినట్టే చేశానండి' వినయంగా అంది.

'ఆవిడ చేసినట్టు చేస్తే మెత్తగా దూదుల్లా వుండాలి. రాళ్లల్లా వున్నాయి యివి. రేపటినించి సరిగా చెయ్యండి- విసుగ్గా అని టిఫిను ప్లేటు ముందునించి వెళ్లిపోయారాయన.

'వరాలూ ఏమొచ్చిందే యీ యిడ్లెన్కి. మెత్తగా లేవూ- చూడు-' అంటూ పనిమనిషి చేతిలో ఓ యిడ్లెను పెట్టి చూడమంది సీతమ్మ. 'బానే వున్నాయమ్మా ఏటో అయ్యగారు' అంది వరాలు- 'అయ్యో. పెద్దాయన టిఫిను తినకుండా వెళ్లిపోయారే, ఏమో బావులేవేమో- నాకు వంటలు తప్ప టిఫిన్లు అలవాటు లేదు. నాకు పెద్ద వంటలు తప్ప, ఏదో ఉప్మా కలియపెట్టి యివ్వడం తప్ప టిఫిన్లు చేయడం రాదు మరి. అంచేత కుదరలేదేమో. ఆవిడ చెప్పినట్టే నూక కలిపాను మరి' నొచ్చుకుంటూ అంది సీతమ్మ.

'ఏమిటండీ యిది, పులుసా, యింత పుల్లగా వుంది. యీ చారింత తియ్యగా వుంది. పులుసులో పడాల్సిన బెల్లం చారులో తగలేశారు. ఈ కూరేమిటిలా నీళ్లోడుతూంది. వంట రాదా మీకు, యిదివరకెక్కడా చెయ్యలేదా. పొద్దుట టిఫినలా తగలేశారు- 'దురుసుగా అన్నారాయన భోజనంచేస్తూ. సీతమ్మ తెల్లపోయింది. వంట రాదూ తనకి. ముప్పై ఐదేళ్లుగా రోజూచేసే పని అది! గుమ్మడికాయ, ములక్కాడ, దుంపలు వేసి పులుసు పెడితే సీతమ్మగారే పెట్టాలి అనేవారు అంతా. పెద్దవంటలు అలవాటయి చిన్న వంటకు పడాల్సినవి సరిగా పడలేదేమిటి చెప్మా అని బాధపడింది. తీరా భోజనం దగ్గిర కూర్చుని రుచులు

చూశాక అన్నీ సరిగా వున్నాయనిపించి, యింకెవరి దగ్గిర చెప్పుకోవాలో తెలియక వరాలు దగ్గర చెప్పుకుంది- వరాలు నవ్వి 'అమ్మగారెళ్లిన కోపం మా మీద చూపిత్తన్నారయ్యగారు'. గత పదేళ్లుగా పనిచేస్తున్న వరాలుకి యింట్లో అయ్యగారి సంగతి బాగానే తెలుసు. 'ఈరోజు వంట సరిగాలేదనిగాదు ఆయనగారి బాధ- అమ్మ ఎంత బాగా వండినా ఏదో వంకలు పెట్టడం ఆయనగారికి అలవాటే. తేలిగ్గా తేల్చేసింది వరాలు.

'అంతేనంటావా, అమ్మబాబోయ్ యిలా వంకలు పెడితే ఎలాచేస్తాం' అంది సీతమ్మ.

'వరాలూ' లోపల్నించి కేక- 'ఏటయ్యగారూ-'

''ఏమిటిలా ఆరిన బట్టలన్నీ కుప్పలా పడేశావు. మడతలు పెట్టాలని తేలీదూ- మడత పెట్టి స్టాండుమీద పెట్టు'' ఆర్డరు వేశారు విశ్వనాథంగారు.

'నేనెప్పుడూ యాడనే పెడతా, అమ్మగారు మడతెట్టుకునే వారు-'

'అంటే, అమ్మగారు లేకపోతే నే పెట్టుకోవాలా' హుంకరించారు- వరాలుకి అమ్మగారు చెప్పలేదు- మర్చిపోయిందేమోననుకుని కింద కూర్చుని మడతలు పెట్టింది.

'ఏమిటా లాల్చి అలా మడత పెడ్తున్నావు. మళ్లీ తొడుక్కోవాలా వద్దా- అలా అడ్డంగా కాదు నిలువుగా పెట్టు-' వరాలు అయోమయంగా చూసింది.

''ఫో అవతలికి, బట్టలు మడతపెట్టడం కూడా చేతకాదు- ఆడదానివి కాదూ. వరాల్ని పొమ్మని మంచంమీద కూర్చుని ఆ నాలుగు బట్టలు అరగంటసేపు విప్పి, మడిచి పేపులో మడతపెట్టుకున్నారాయన- పెళ్లికి ముందు తల్లి, పెళ్లయ్యాక భార్య చాకిరి చేయడం అలవాటయిన ఆయన మంచినీళ్లు కూడా బిందెలోంచి ముంచుకు ఏనాడు తాగలేదు. బట్టలు రెడీ చేసి, స్నానానికి నీళ్లు తొలిపి, టిఫిను, భోజనాలు రెడీ చేసి వేళకి అన్నీ అమర్చిపెట్టే భార్య! మగాడంటే చేయించుకోడం తప్ప, చేసే జాతికాదని ఆయన విశ్వాసం- అది ఆయనకాఇంట్లో అబ్బిన సంస్కారం- తల్లి ఏనాడు వంటింటి గడప దాటని మహా యిల్లాలు. ఆవిడ ఆయనకి ఆదర్శం. దానికితోడు పెళ్లికాంగానే తండ్రి చేసిన నీతి బోధ! పెళ్లయి భార్య కాపురానికి వచ్చిన కొత్త పెళ్లాం మోజులో నూతిలో నీళ్లు తోడడం అలవాటులేని భార్యకి నీళ్లు తోడిపెడ్తున్న కొడుకుని చూసి 'పిచ్చి సన్నాసి కొత్త పెళ్లాం మోజు యిలా వదిలేస్తే రేపట్నించి నీళ్లే తోడిస్తుందో, వాకిళ్లే తుడిపిస్తుందో. ఆడారి వేధవలా వీడు పనులు చేసి వంశగౌరవం మంట గలిపేస్తాడేమోననిపించి కొడుక్కి హితబోధ చేశాడు. 'ఓరేయ్ బాబీ, ఈ ఆడాళ్లున్నారు చూశావా వెంట్రుక వాసంత దారి యిచ్చావో, ఆ వెంట్రుక పట్టుకుని తలపైకెక్కి కూర్చుని నీ జుట్టుపట్టి ఆడిస్తారు జాగ్రత్త. అలాంటి పొరపాటు చేయకు. ఎక్కడుండాల్సిన వాళ్లని అక్కడుంచితేనే మనకి లొంగుతారు' అని అన్న మాటలు కొడుకు బుర్రలో బాగానే దూరాయి. తండ్రి తల్లిమీద అధికారం చెలాయిస్తూ చేయించుకునే పనులుచూసి మగాడంటే అలాగే వుండాలన్న నమ్మకం కలిగింది. దానికితోడు రాజేశ్వరి పట్నం పిల్ల. స్కూలు ఫైనలు చదివింది. కాన్వెంట్‌లో చదవడంవల్ల యింగ్లీషు బాగా మాట్లాడేది. పేపర్లు, పుస్తకాలు తెగ చదివేది. తల్లిలా వంటింట్లోనే పడి వుండకుండా పనులు అయ్యాక నీట్‌గా తయారయ్యేది. యిల్లు పొందికగా సర్దడం ఆవిడ కట్టుబొట్టు, మాటమంతిలో ఆధునికత కనిపించేది. మనసులో భావాలు స్వేచ్ఛగా, చనువుగా వ్యక్తీకరించేది. తనకు నచ్చనిది వాదనచేసి తప్పొప్పులు చర్చించి వప్పించాలని ప్రయత్నించేది... యివన్నీ చూసి ఆవిడ ధోరణి గుర్తించి 'అమ్మో తండ్రి చెప్పింది నిజం. ఆలసిస్తే తనని లెక్కచెయ్యదు. మొక్కగానే వంచి అదుపాజ్ఞలలో వుంచాలని నిర్ణయించుకున్నారాయన.

ఆవిడ చెప్పింది వప్పుకోకుండా మగాడిమాట ఆడది వినాల్సిందే. ఆడది వంటింటి వరకే పరిమితం అన్న విషయాన్ని ఆవిడకి వంట పట్టించేందుకు కాస్త యిబ్బందే అయింది ఆయనకి. మొగుడు అయినదానికి కాని దానికి కాలు దువ్వినట్టు ఎందుకు మాట్లాడుతాడో. కసిరి చెప్పడం, అథారిటీ చేసి పనులు చేయించుకోడం ఎందుకు. సౌమ్యంగా చెప్పరాదా అని బాధపడేది. ఆ మాట అంటే 'నోరు మూసుకో నీ అతి తెలివి నా దగ్గిరకాదు' అని ఎగిరే భర్త మనస్తత్వం ఆమెకి అర్థమయ్యేది కాదు. నొచ్చుకునేది. వాదిస్తే మరింత కోప్పడి రోజుల తరబడి మాట్లాడకుండా సాధించే భర్తని చూసి బాధపడేది.



**వయసు మీదపడి రిటైరై యింట్లో కూర్చోడం ఆరంభించాక ఆయన చిరాకులు, సాధింపులు, కసుర్లు ఎక్కువై రాజేశ్వరికి భరించలేని నైరాశ్యం, విరక్తి భర్తంటే ద్వేషం మరింత పెరిగి ఆ పరిసరాల నించి, వాతావరణంనించి కొన్నాళ్లైనా దూరంగా ప్రశాంతంగా బతకాలన్న ఆలోచనకు వచ్చింది.**

కొన్నాళ్లిలా జరిగాక భర్తని మార్చుకోలేక అందరిలో చిన్నపోవడం యిష్టంలేక ముభావంగా తన పనులుతాను చేసుకోడం అలవరుచుకుంది. ఉద్యోగానికి వేరింటి కాపురానికి వచ్చినా ఓ అచ్చటాముచ్చటా లేకుండా గంభీరంగా వుండే భర్తని చూసి అతని మనస్తత్వం అంతే అని సరిపెట్టుకుని సర్దుకుపోవడం అలవాటు చేసుకుంది. పిల్లలు పుట్టారు. పెరిగారు. వెళ్లారు. మళ్లీ యిద్దరే మిగిలినా మనసులో మాట స్వేచ్ఛగా ఏనాడు చెప్పుకోలేక వంటరితనమే అనుభవించింది. తన పని, తన పూజ, మొక్కలు, పుస్తకాలు, పాటలు వినడం తన కాలక్షేపంగా చేసుకుంది. భార్యని చెప్పుచేతల్లో వుంచుకున్నానని, సాధించాను అనుకున్నారు తప్ప కాపురంలో తను కోల్పోయిందేమిటో ఆయన గ్రహించుకోలేదు.

వయసు మీదపడి రిటైరై యింట్లో కూర్చోడం ఆరంభించాక ఆయన చిరాకులు, సాధింపులు, కసుర్లు ఎక్కువై రాజేశ్వరికి భరించలేని నైరాశ్యం, విరక్తి భర్తంటే ద్వేషం మరింత పెరిగి ఆ పరిసరాల నించి, ఆ వాతావరణం నించి కొన్నాళ్లైనా దూరంగా ప్రశాంతంగా బతకాలన్న ఆలోచన కు వచ్చింది. దూరం వెడితే విలువ తెలుస్తుంది అని కొడుకుతో ప్రయాణం పెట్టుకుంది.

* * *

'వరాలూ, అమ్మబాబోయ్, యీయనకి వండి పెట్టడం నావల్లగాదే తల్లీ. ఏం చేసినా వంక పెట్టందే తినడే. ప్రతి దానికి కస్సుబుస్సులాడుతూ కసిరితే పడడానికి నేనేం పెళ్లాన్నిగాదు. ఏదో ఓ నెల రెండు నెలలు అట్టే పని లేకుండా విశ్రాంతిగా వుండచ్చు. జీతం ఎక్కువివ్వాలన్నారని వప్పుకున్నాను. నాకేం గతిలేక పడి వుంటాననే ఆయన ఉద్దేశం. వంటలకెళ్లి రోజుకి 2,3 వందలు సంపాయించుకుంటాను. ఏమనుకుంటున్నాడో ఆయన. నా వంటకి వంకలు పెడ్తారేమిటి. ఎన్ని శుభకార్యాలకి వండినదాన్ని.

సీతమ్మ గింజుకుని ఉక్రోషంగా అంది. 'ఆయనంతేనమ్మా, పాపం ఆవిడ నోరుమూసుకు పడి వుంటుంది గనక యీయన ఆటలు సాగుతున్నాయి. కాస్త నోరున్న ఆడది యితే అగ్గిరాజేయక్కరలేకుండా అగ్గి రాజుకునేది. అమ్మగారెళ్లాక యీయనగారికి అమ్మ వంట బాగుందని, అమ్మ టిఫిన్లు బాగా చేస్తుందని, ఇల్లు శుభ్రంగా వుండేదని తెలిసొచ్చింది. నన్ను సతాయిస్తున్నాడుగా యీ మూల తుడవలేదు, బట్టలు బాగా వుతక లేదని-

'ఏమో నెలవగానే జీతం పట్టుకుపోతాను- మాటలు పడాల్సిన ఖర్మ నాకేమిటి' కోపంగా అంది సీతమ్మ.

* * *

అమెరికాలో కొడుకింటికి వచ్చాక నిజంగా రాజేశ్వరికి శారీరకంగా, మానసికంగా మంచి విశ్రాంతి దొరికినట్టు చాలా హాయిగా, ఆనందంగా వుంది. మనవలతో మాట్లాడుతూ, వాళ్లతో గేమ్స్ ఆడుతూ, కథలు చెపుతూ ఏ బరువు, బాధ్యతలు లేకుండా వుండడం ఎంతో నచ్చింది.

కొడుకు కాపురం చూస్తుంటే, భార్యాభర్తలంటే యిలా వుండాలి. సంసారం అంటే యిది అని అడుగడుగునా అనిపించేది. యిద్దరూ ఉద్యోగస్థులు యిద్దరూ చెరో పనిచేస్తారు చకచక- ఆడపని మగపని అనికాదు- కోడలు వంట చేస్తుంటే కొడుకు గిన్నెలు కడుగుతాడు. వాషింగ్ మెషీన్లో బట్టలువేసి ఆరేస్తాడు. పిల్లల్ని స్కూలుకి తయారుచేస్తారు. ఏ చిన్న పొరపాటు చేసినా సారీ, వెరీ సారీ, అంటుంటాడు- 'థాంక్స్'లు సరేసరి. కోడలు వినోదినీ అంతే ఏదన్నా మర్చిపోతే 'అయ్యో సారీ మర్చిపోయాను-' అంటుంది. 'ఫర్‌గెట్ యిట్-' అంటాడు కొడుకు. వంటలో ఏదన్నా లేదంటే నవ్వుతూ హాస్యంగా చెపుతాడు- 'అయ్యో సారీ' అంటుంది ఆ అమ్మాయి. ఒక్కపూట ఏ ఉప్పో కారమో ఎక్కువైతే కావాలని చేసినట్టు దెప్పే భర్తతో కొడుకుని పోల్చుకోలేకుండా వుండలేకపోయింది. పోనీ కొడుక్కి తండ్రి వారసత్వం రాలేదు. కోడలు అదృష్టం అనుకుంది. రాత్రి అంతా డైనింగ్ టేబిలు దగ్గిర ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తారు. పిల్లలు చెప్పినవి శ్రద్ధగా వింటారు. అనుమానాలు, సందేహాలు ఓపిగ్గా వివరిస్తారు. పిల్లల్ని ఎంత ముద్దుచేసినా 'ఊ' అనగానే కళ్లతో వారిస్తే ఆగిపోతారు. ఇలాంటి పెంపకం తన పిల్లలకి ఉండేదా- తండ్రంటే భయం తప్ప ప్రేమ, భక్తి వుండేవా. భార్యాభర్తల మధ్య అన్యోన్యత, అనుబంధాలు, అనుభూతులు పంచుకోడం ఏం వున్నాయి తన కాపురంలో- వన్‌వే ట్రాఫిక్ లాగ ఆయన మాట. ఆయన పంతం, ఆయన అధికారం తప్ప యిచ్చిపుచ్చుకునే ఆనందం తన సంసారంలో ఏరోజూ దొరకలేదు. అన్ని సంపదలని మించినది, భార్యాభర్తల మధ్య అన్యోన్యత అన్నది వీళ్ల సంసారం చూసేక మరీ మరీ తెలుస్తూంది అనుకుంది రాజేశ్వరి.

వచ్చి యిరవై రోజులు దాటాక 'మీ నాన్న ఎలా వున్నారో- నేలేని లోటు కాస్తయినా తెల్సిందో లేదో' అంది భోజనాల దగ్గిర.

'ఎలా వుండడానికి ఏముంది. వారంవారం ఫోనులో మాట్లాడుతున్నాంగా- బాగానే వున్నారు.'

'ఆ బాగుండడం కాదు' నవ్వింది రాజేశ్వరి.

'అమ్మా, కొన్నాళ్లు నాన్న సంగతి మర్చిపో- కనీసం యిక్కడున్నన్ని రోజులైనా హాయిగా ప్రశాంతంగా వుండు' అన్నాడు నరేష్.

''బాగుంది. ఎలా మర్చిపోతారు. ఏభై ఏళ్ల అనుబంధం- చెప్పినంత సులువుగాదు'- కోడలు వినోదిని అంది.

'పోనీ నీకంతగా అనిపిస్తే ఫోనుచేసి మాట్లాడు ఎవరొద్దన్నారు'- అన్నాడు నరేష్.

'వద్దొద్దు, ఊరికే అన్నాను. అసలు ఆయన ఎలా ఫీలవు

*(మిగతా 12వ పేజీలో)*

(9వ పేజీ తరువాయి)

తున్నారు, మనసులోనైనా మిస్సవుతున్నారో లేదో అన్న ఆలోచనతో అలా అన్నా అంతే నవ్వుతూ అంది రాజేశ్వరి.

"మన యిండియన్స్ యీ సెంటిమెంట్సు, యీ బలహీనతలే పెళ్ళిళ్ళని నిలబెడ్తున్నాయనుకుంటారు. ఓ విధంగా మైనస్ పాయింట్. మరో విధంగా ప్లస్ పాయింట్."

'నిజమే మన పెళ్ళిళ్లలో వుండే పవిత్రతో, సెంటిమెంటో గాని కొట్టుకున్నా తిట్టుకున్నా భార్యాభర్తల మధ్య బంధం విడిపోకుండా వుండడం అన్నింటికన్నా గొప్పదనుకుంటాను' వినోదిని అంది.

'ఏమిటో నాయనా పెట్టిపుట్టడమంటే యిదే. చేసుకున్న వాళ్లకి చేసుకున్నంత అన్నట్టు భార్యాభర్తల అన్యోన్యత ఓ అదృష్టమే- దానికి నేను నోచుకోలేదు- నిట్టూర్చింది.

'అమ్మా అసలు నీవు నాన్నని మార్చడానికెప్పుడూ ప్రయత్నించలేదా?'

'ఏదో సామెత చెప్పినట్టు రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుందని అడుగుతున్నావు, నలభై ఏళ్లకి పైగా మీ నాన్నని చూస్తూ- ఆయన ఏనాడన్నా యితర్లని మాట్లాడనిచ్చారా- మాట్లాడే అవకాశం యిచ్చారా- ఓ ఏభై ఏళ్ల క్రితం, ఆర్థిక స్వాతంత్ర్యం లేని భార్య భర్తకి ఎదురుతిరిగి నీ పద్ధతి మార్చుకో అని చెప్పగలిగే అవకాశం వుందా అసలు. చెప్పినా ఆ భర్త సామరస్యంగా అర్థంచేసికొని తనని తాను మార్చుకునే ప్రయత్నంచేసే సౌమ్యత ఆనాటి మగవాళ్లలో వుండేదా! వున్నా నూటికి కోటికి ఒకరు... భార్యల మనోభావాలకి గౌరవం యిచ్చే ప్రసక్తి ఎక్కడుంది రా...

'అది నిజమే నరేష్- అసలు మన దేశంలో భార్యాభర్తల మధ్య అభిప్రాయభేదాలకి అసలు కారణం కమ్యూనికేషన్ గ్యాప్ అంటాను-' వినోదిని అంది.

'అందరూ కాదులే అమ్మా- అంతా ఆయనలా వుంటారా-'

'అదీ నిజమేలే మగాళ్లంతా చెడ్డవాళ్లని ఎలా అంటాం- కాని మొత్తంమీద ఆ రోజుల్లో ఆ శాతం ఎక్కువ... పూజకొద్దీ పురుషుడన్న మాట నిజం-'అని నిట్టూర్చి- 'అందుకే మీ నాన్న కాస్తయినా నేలేని లోటు గుర్తించారా అన్నది తెల్సుకోవాలని ఆరాటం'- అంది.

'రేపు ఆదివారం ఫోను చేస్తాగా- అపుడు నీవే అడుగు. బుద్ధి వచ్చిందా' అని హాస్యంగా అన్నాడు కొడుకు.

* * *

మర్నాడు ఫోను వరాలు తీసింది. 'అయ్యగారు స్నానం చేస్తున్నారండయ్యా- అంటూ గబగబ ఆరాటంగా' అబ్బాయిగారూ, అమ్మగారికి చెప్పండి వంటావిడ వెళ్లిపోయింది- హోటల్నించి తెచ్చుకుతింటున్నారు- ఆ భోజనం పడక రెండురోజుల నించి యిరేచనాలు- నీరసపడిపోయారు. ఫోను అమ్మగారికీయండి బాబూ' రాజేశ్వరికి అన్న చెప్పాలన్న ఆరాటంతో అంది- ఫోనందించాడు నరేష్. రాజేశ్వరి ఆందోళనగా 'ఎందుకెళ్లిపోయిందే సీతమ్మ. వచ్చేవరకు వుండమని మరీమరీ చెప్పాను గదా-' 'ఎందుకేటమ్మా- సాధిస్తే, తిడితే పడతారేంటి- మీరేంటి వూరుకోడానికి- మీరెళ్లాక అయ్యకోపం మరీ ఎక్కువైందమ్మా. నన్ను తెగ సాధిస్తున్నారు. బేగ వచ్చేయండమ్మా- 'వరాలూ' అన్న విశ్వనాథంగారి కేక. 'ఎవరితో మాట్లాడుతున్నావు పెట్టేయి ఫోను. నిన్నిక్కడ విషయాలు చెప్పమని ఎవరు చెప్పారు- ముందా ఫోను పెట్టు హుంకరించారు. ఫోను కట్ అయింది. రాజేశ్వరి నిట్టూర్చింది. కొడుకు మళ్లీ ఫోను చేసినా ఊ- ఆ- అని పొడి మాటలు- 'నాకేం, బాగున్నాను' అంటూ ముక్తసరిగా మాట్లాడి పెట్టేశారు విశ్వనాథం.

'అయ్యో, భోజనానికి ఏం చేస్తున్నారో- హోటలు తిండి పడద్దూ వంటికి-' రాజేశ్వరి ఆదుర్దాపడింది.

'నీవూరికే గాభరా పడకమ్మా- యీసారి ఆయనకి భార్య విలువ బాగా తెలుస్తుంది. మరేం పరవాలేదు. పూర్లో చాలా హోటళ్లున్నాయి-' కొడుకు తేలిగ్గా అన్నాడు.

* * *

మళ్లీ ఆదివారం నరేష్ ఫోనుచేస్తే ఫోను ఎవరు తీయలేదు. రోజంతా నాలుగైదుసార్లు ఫోనుచేసినా ఎవరూ తీయకపోవడంతో నరేష్‌తోపాటు రాజేశ్వరీ ఆందోళన పడింది. 'ఏమయ్యారీయన - ఎక్కడికి వెళ్లి వుంటారు' స్వగతంలో అనుకున్నాడు నరేష్. నానీ- పోనీ ఓసారి పక్కింటి శంకరరావుగారికి చేసి చూడు, లేదంటే మీ రంగ బావ వున్నాడుగా అతనికి చెయి ఏమన్నా వాళ్లకి తెలుసేమో- వుండు నంబర్లు యిస్తాను-' తన డైరీలో నంబర్లు చూసి యిచ్చింది రాజేశ్వరి. శంకర్రావు 'వారం రోజులుగా యిల్లు తాళం వేసి వుంది. ఎక్కడికెళ్లారో ఏం చెప్పలేదు' అని చెప్పాడు- రంగాని అడిగితే. అంకుల్ వారంరోజుల క్రితం వచ్చి వంట మనిషి

**'నానీ, ఏమిటోరా నాకు గాభరాగా వుంది. ఈ పెద్దమనిషేమయ్యారో. ఆరోగ్యం సరిగా లేక ఏ ఆస్పత్రిలోనన్నా చేరలేదు గదా. నాకు టిక్కెట్టుకొనేయరా బాబూ. ఏదన్నా కానిది జరిగితే లోకం నింద నామీద వేస్తుంది' అంది అపరాధ భారంతో.**

కావాలి చూసి పెట్టమన్నారు. చూసి కుదిర్చి చెప్తానన్నాను. యింకా ఎవరూ దొరకలేదని ఫోను చెయ్యలేదు. మరీలోగా ఎక్కడికెళ్లారో ఏం చెప్పలేదు- అన్నాడు. రాజేశ్వరి కలవరపడింది. 'వుండు ఇందుకేమన్నా ఫోను చేశారేమో నాన్న అడుగుతాను' అంటూ డెట్రాయిట్‌లో వున్న చెల్లెలికి ఫోను చేశాడు నరేష్. జరిగింది చెప్పాడు. 'ఏమిటో అన్నయ్యా, అమ్మ చేసిన పని బాగులేదు -ఈ వయసులో ఆయన్నిలా వంటరిగా వదిలి రావడం ఏమిటి. అన్నేళ్లు భరించినావిడ యీ ఆఖరురోజుల్లో ఆయనలో మార్పు వస్తుందనుకుండా- నాన్న నాకేం ఫోను చేయలేదు మరి' అంది.

'నానీ, ఏమిటోరా నాకు గాభరాగా వుంది. ఈ పెద్దమనిషేమయ్యారో. ఆరోగ్యం సరిగా లేక ఏ ఆస్పత్రిలోనన్నా చేరలేదు గదా. నాకు టిక్కెట్టుకొనేయరా బాబూ. ఏదన్నా కానిది జరిగితే లోకం నింద నామీద వేస్తుంది' అంది అపరాధ భారంతో. కొడుక్కి ఏమనాలో తెలియక తల ఊపాడు.

* * *

ఆదివారం- ఉదయం పది గంటల వేళ అంతా సావకాశంగా డైనింగ్ టేబిల్ దగ్గిర దోశలు తింటుండగా, కారు చప్పుడు. ఆ వెనక యిందుమతి గొంతు వినిపించి, కిటికీ లోంచి తొంగి చూసిన వినోదిని, 'మావయ్యగారు- మావయ్యగారొచ్చారు' సంభ్రమంగా అంటూ వీధి తలుపు తీయడానికి గబగబా వెళ్లింది. తల్లి కొడుకులు అర్థంకాక మొహాలు చూసుకుంటుండగానే ముందు ఇందుమతి, వెనకాల నెమ్మదిగా నడుచుకుంటూ విశ్వనాథంగారూ వచ్చారు. 'నాన్నగారిని తీసుకొచ్చానమ్మా' నవ్వుతూ అంది ఇందుమతి తల్లి దగ్గిరకెళ్లి. 'ఎప్పుడొచ్చారు- నిన్న మాట్లాడినప్పుడు చెప్పనే లేదు- తెల్సుండీ చెప్పకుండా నటించావా-' చెల్లెల్ని మందలిస్తూ- 'ఏమిటి నాన్నా యిది- చెప్పకుండా చెయ్యకుండా అలా యిల్లు తాళం పెట్టి వెడితే మేం గాభరా పడి అందరికి ఫోన్లు చేశాం. ఫోనుచేసి వస్తున్నట్టు చెప్పొచ్చుగా'- కాస్త గట్టిగానే అన్నాడు నరేష్.

'నా కూతురు, నా మనవడిని చూడాలనిపించి వచ్చాను- నీ పర్మిషన్ తీసుకురావాలా-' బుకాయింపుగా అన్నారాయన.

'నాన్న వస్తానని వీసా పేపర్లు అదీ పంపమని, ఎవరికి చెప్పద్దని ప్రామిస్ చేయించుకున్నారు. వచ్చి నాలుగు రోజులయింది అపుడే. నిన్న నీ ఫోను వచ్చాక యింక సస్పెన్స్ వద్దని నేనే తీసుకొచ్చాను- చూశావా అమ్మా, నాన్నకి నీవంటే ఎంత ప్రేమో. నీవు లేకుండా వుండలేక నీవెంట పరిగెత్తి వచ్చేశారు' విశ్వనాథంగారి మొహం సిగ్గుతో ఎర్రబడింది. 'అదేం కాదు- ఆవిడేనేంటి యిష్టం వచ్చిన చోటుకి వెళ్లగలదు, నేనూ వెళ్లగలను' బెట్టుగా తగ్గిపోవడం యిష్టంలేక దబాయింపుగా అన్నారాయన. 'అబ్బ, ఏమిటి నాన్నా, ఒక్క చిన్న మాట -నీవు లేకుండా తోచలేదు. అందుకే వచ్చానంటే అమ్మ సంతోషిస్తుందిగా, మీ మగాళ్లకెంతా ఇగో' కూతురు నవ్వుతూ అంటించింది.

'ఆ ఇగోలే భార్యాభర్తల మధ్య దూరాలని పెంచేది. అది మగాళ్లకి అర్థంకాదు. పెళ్లాం ముందు తలవంచకూడదు. తల వంచడం తలవంపులు అనే మనస్తత్త్వంవల్ల తాను జీవితంలో ఏం కోల్పోయానన్నది మగాళ్లకి అర్థంగాదు' రాజేశ్వరి నవ్వుతూ అంటించింది - భార్య వంక గుర్రుగా చూసి 'నేనెప్పటికీ తలవంచని వీరుడినే' గర్వంగా తలెగరేశారాయన. 'హు- భార్యాభర్తలు ఒకరిముందు ఒకరు తల వంచాల్సిన అవసరం వుందని చెప్పడానికే ఒకరి చేతులో ఒకరి తలవుంచి పెళ్లితంతులో జీలకర్ర బెల్లం పెట్టించడంలో భావం అదే! అవసరం అయితే భార్య ముందు భర్త తల దించితేనే ఆ సంసారంలో సామరస్యం వుందని చెప్పక చెప్పడం- అలాగే నలుగురిలో భార్య కాళ్లు పట్టుకుని మెట్టెలు పెట్టిస్తారు. సంసారంలో అన్యోనత, అనురాగం వుండాలంటే అవసరం అయినపుడు భర్త కాళ్ల బేరానికి దిగాలి. అందులో సిగ్గుపడాల్సింది లేదని చెప్పడానికే అనుకుంటాను రాజేశ్వరి అంది.

'అబ్బో, మీ అమ్మకి పడమటి గాలి బాగా వంటపట్టినట్టుంది. మాటలు జోరుగా వస్తున్నాయి. పెళ్లిళ్ల గురించి రీసెర్చి చేసినట్టు మాట్లాడుతూంది' హేళనగా అన్నారాయన.

'అవును యిన్నాళ్లు నోరిప్పకపోవడమే నేచేసిన పెద్ద తప్పని యిక్కడికి వచ్చాకే బాగా అర్థమైంది. ఆడది నోరిప్పితే తిరుగుబాటు ధోరణిలాగే కనిపిస్తుంది మగాడికి.'

'డాడీ, వాటెవర్ యూసే, అమ్మ చెప్పిందాన్లో నిజం వుందని మీరు వప్పుకోవాలి యిప్పటికైనా- బెటర్ లేట్ దేన్ నెవ్వర్ అన్నాడు కొడుకు'. అన్నయ్యా, నాన్నగారిలా రావడంలోనే అర్థం అవడంలేదూ, అమ్మమీద ఎంత ప్రేమో. మన మూడుముళ్ల బంధం గట్టిదన్నయ్యా. లేదనుకోడం అంత సుళువుకాదు. విశ్వనాథంగారి మొహం సిగ్గుతో ఎర్రబడింది. పంతంగా తల అడ్డం తిప్పుతూ భార్య వంక తలెగరేసి చూసి 'ఐవిల్ నెవ్వర్ సరెండర్ టూ హర్' పంతంగా అన్న ఆ గొంతులో సామరస్యం తప్ప పట్టుదల కనపడలేదు. కొడుకు, కూతురు నవ్వారు.

ఆయన మొహం చూస్తూ రాజేశ్వరి నవ్వుకుని 'ఏడిశారు లెండి, నెలరోజులకే మొహంలో పళ్లు, కళ్లు వెళ్లుకొచ్చాయి. బుకాయించకండి' అని చెవి మెలేసి చెప్పాలనిపించింది. వెంటనే అంత సామరస్యం, సరసం వుంటే యింక కావల్సిందేం వుంది అనిపించింది. చిన్నప్పుడు కొడుకు అన్నం తిననని మారాంచేస్తూ ముద్ద నోట పెట్టకుండా పెదాలు బిగించి కూర్చుంటే 'పిచ్చి వెధవాయమ్మా, అమ్మమీద కోపం వస్తే అన్నం మీద చూపిస్తారా' అంటూ సుతారంగా నెత్తిన జెల్లకాయ వేసినట్టు మొగుడినెత్తినా ఒకటి వేసి లాలించాలనిపించింది ఆ క్షణాన- ఆవిడలోని తల్లి మనసుకి- ★

**గమనిక:**

*26, డిసెంబరు 2004 ఆదివారం అనుబంధం -9వ పేజీ- రచయిత్రి పరిచయంలో జననం: 1992 జూలై 16న అని, భర్త సోమంచి విష్ణుమూర్తి అని పొరపాటున ముద్రితమైంది. రచయిత్రి జననం: 1962 జూలై 16న, భర్త: చదలవాడ విష్ణుమూర్తి అని గమనించగలరు.*

-ఎడిటర్